# వియ్యంగా మారిన పరిచయం

మధ్యాహ్నం రెండుగంటలయింది. రోడ్లన్నీ ఎండ వలన తారుతో ఉడికి పోతున్నాయి. రోడ్డుమీద కాలు పెడితే కణేల్ మన్నట్టుగా ఎండ వుంది. అటు వంటి సమయంలో రవి ఒంటరిగా రోడ్డుమీద నడచి పోతున్నాడు. చేతిసంచి పట్టుకొని మొహం మీద పడుతున్న చెమటను జేబురుమాలుతో తుడుచుకుంటూ గబా గబా అడుగులు వేస్తున్నాడు. అతని మెదడులో ఏవో ఆలోచనలు గాలిబుడగల్లా వస్తు అంతరించి పోతు న్నాయి.

రెండురోజులక్రిందట తనుతండ్రితో ఘర్షణపడ్డాడు. చాలా చిన్న విషయంలో. ఒకరోజతను ఆఫీసునుండి వస్తుండగా ఒకస్నేహితుడు కలసి తనతో హోటలుకు రమ్మన్నాడు. హోటలుకు వెళ్ళి ఇద్దరూ కాఫీ త్రాగి వస్తుండగా ఒకచోట రిక్షావాడితో ఒక యువతి తగవు లాడుతూ కనిపించింది. ఏమిటో విందామని దగ్గరకు వెళ్లేసరికి వాళ్లిద్దరి సంభాషణా ఇలా వుంది.

"ఏమమ్మాయ్! ఇంతదాక రిక్షా తొక్కుకొనివస్తే పైసా ఇవ్వనంటావ్" అన్నాడు రిక్షావాడు.

"అబ్బ! నేను పైసా ఇవ్వననడం లేదు. నా పర్సు ఎక్కడో పడిపోయింది. మరికొంచెం దూరం వచ్చే వంటే నీ డబ్బులు ఇచ్చేస్తాను." అంది ఆ యువతి.

"అమ్మా ఈ పప్పులు నా దగ్గర వుడకవు. డబ్బులు ఇస్తే సరేసరిలేదా నీపెట్టె తీసుకోవలసి వస్తుంది. జాగ్రత్త.

ఇక వూరుకుంటే వాడన్నంత పనీ చేసేస్తాడనుకొని తను కలుగజేసికొని "అరే! ఆమె నీకెంత ఇవ్వాలి", అని అడిగేడు.

"పన్నెండణాలు ఏం? నువ్విస్తావా?" అని వాడు తన్ను ప్రశ్నించేడు.

"అవును నేనే ఇస్తాను." అంటూ జేబులో నుండి పర్సు తీసి పన్నెండణాలు వాడి చేతికో పెట్టేడు.

రిక్షావాడు ఆ డబ్బులు తీసికొని పెట్టెదించి వెళ్ళి పోయేడు.

"సమయానికి వచ్చి సహాయం చేసేరు. చాలా థేంక్స్" అంటూ చేతులు జోడించిందా యువతి.

దానికేం లెండి "మీ ఇల్లెక్కడ?" అని తను అడి గేడు.

"ఇక్కడే మీరు మా యింటిదాకా వచ్చేరంటే మీ డబ్బులు ఇచ్చేస్తాను."

"సరే పదండి" అంటూ ఆమెతో నడిచేడు.

ఇద్దరూ కలసి కొంతదూరం వచ్చిన తరువాత ఒక మేడింటి ముందు ఆమె ఆగి "ఇదే మా యిల్లు లోపలికి రండి" అంటూ దారి తీసింది.

ఆ యింటిలోపల పరిసరంతా చాలా బావుంది ఒక హాలు మధ్యగా టేబులు దాని చుట్టూ నాలుగు కుర్చీలున్నాయి. ఒక కుర్చీలో ఒకముసలాయన సుమారు అరవై సంవత్సరాలుంటాయి కూర్చొని పేపరు చదువు తున్నారు. ఆమె ఆయన ప్రక్కకు వెళ్ళి "తాతయ్యా" అని పిలిచింది. ముసలాయన తలెత్తి "సరోజా! ఇంత ఆలస్యమైందేమమ్మా?" అని అడిగేరు.

"దారిలో వస్తుండగా పర్సు పోయింది తాతయ్యా అది చూసుకోకుండా రిక్షాఎక్కి వచ్చేను. మనవీధి చివ రకు వచ్చేసరికి పైరుపంచరు అయింది. రిక్షావాడు నన్న క్కడే దిగిపోయి డబ్బులిమ్మన్నాడు. చూసుకొనేసరికి పర్సు పోయింది. సమయానికి ఈయన వచ్చి సహాయం చేయకపోతే నలుగురిలో నా పరువు పోయివున్ను", అంది తనవైపు చిరునవ్వుతో చూస్తు.

"మీరు ఈవేళ మా సరోజకు చాలా సహాయం చేసేరు. చాలా థేంక్స్. అరే! నిల్చొనే వున్నారు. అలా కూర్చోండి. సరోజా కాఫీ పట్రా" అని ముస లాయన అన్నారు.

"ఇదిగో ఒక నిముషంలో తెస్తాను." అంటూ లోప లికి పరిగెత్తింది సరోజ.

"నీపేరేమిటి బాబు?" అంటూ ఆ ముసలాయన ప్రశ్నించేరు.

"రవి." అని తను సమాధాన మిచ్చేడు.

"మీ నాన్నగారి పేరు?" మళ్ళీ ప్రశ్న వేసేరు.

"నరసయ్యగారంటారండి. ఆడీటరు రామారావు గారి దగ్గిర గుమస్తాగా వుండేవారు." అని సమాధానం ఇచ్చేడు.

"నరసయ్య మీ నాన్నగారా?" ఆశ్చర్యంతో ఆ ముసలాయన ప్రశ్నించేరు.

"అవునండీ, మీకుగాని పరిచయముందా?" అని తను అడిగేడు.

"పరిచయమేమిటి వాడు నాకు దూరపుచుట్టంకూడా." అని ముసలాయన అన్నారు.

ఇంతలో సరోజ రెండు కాపీలు పట్టుకొచ్చింది. ఆయన రవికొక కాఫీ ఇచ్చి తను ఒకటి పుచ్చుకున్నారు. కాపీ త్రాగడం పూర్తయిన తర్వాత సరోజ వచ్చి ఇద్దరికీ వక్కపొడి ఇచ్చింది. తర్వాత ఒక పావుగంట వరకు అదీ ఇదీ మాట్లాడుకొన్న తర్వాత తను ఇంటికి వచ్చేశాడు. తరువాత సరోజ రోజూ సాయంకాలం పూట తనను కలుస్తుండేది. ఒక అయిదు నిముషాలు మాట్లాడి వెళ్ళిపోయేది.

వారంరోజుల తర్వాత మరి సరోజ కనబడలేదు. తను ఆపీసు పనిమీద పదివేల రూపాయలు పట్టుకొని విజయవాడ వెళ్ళవలసి వచ్చింది. రైల్లో వెడుతుండగా దురదృష్టవశాత్తు డబ్బు వున్న బేగు ఎక్కడో పోయింది, తత్ఫలితంగా నెలకు రెండు వందల రూపాయలు వచ్చే ఉద్యోగం పోయింది.

ఆ తరువాత ఉద్యోగం కోసం ఎంత ప్రయత్నించినా దొరకలేదు. దానికి తోడు సరోజతో తనకున్న పరిచయాన్ని అనేక కట్టు కథలుగా కల్పించి ఎవరో కిట్టని వాళ్ళు తన తండ్రికి ఆకాశ రామన్న ఉత్తరం రాసేరు. ఆ ఉత్తరాన్ని చూచి తన తండ్రి ఏమంటారో అనే భయంతో బితుకు, బితుకుమంటూ ఉండే వాడు. కానీ తన తండ్రి ఆ ఉత్తరాన్ని చూసికూడ ఏమీ అనలేదు.

ఒక రోజు సాయంత్రం తను నిద్రలేచి ముఖం కడుక్కొని, బట్టలు వేసుకుంటుండగా తన తండ్రి వచ్చి "నాయనా రవీ! మన దూర ్ చుట్టం ఒకాయన వచ్చి నీకు తన మనుమరాలినిచ్చి వివాహం చేస్తానన్నాడు. వాళ్ళ సాంప్రదాయం చాలా మంచిది. నువ్వేమంటావు నాయనా" అని అడిగేరు.

" నా పెళ్ళికి ఇప్పుడేం తొందర వచ్చింది నాన్న ఆ సంగతి తరువాత చూసుకుందాం" అన్నాడు తను.

"అదికాదు నాయనా! మీ అమ్మపోయి నాలుగేళ్ళు కావస్తుంది. ఇంట్లో ఆడదిక్కంటూ ఎవరూ లేరు. నేనా ముసలాణ్ణి అయిపోతున్నాను. నా కాళ్ళూ చేతులూ

రచన:

శ్రీ కలగర్ల నీలకంఠేశ్వరరావు.

గట్టిగా ఉన్నంత కాలం ఏమీ పరవాలేదు. ఆ తరువాత నాకు దిక్కేవిటి? నువ్వేదేనా ఉద్యోగం వచ్చిన తరువాత పనిచేయడానికి బైటకు వెళ్ళిపోతావు ఇంట్లో నాకేది కావల్సినా ఇచ్చేవారెవరు? కాబట్టి నా మాట విను నాయనా ఆయన ఎడ్రసుకూడ ఇచ్చేడు. నువ్వు ఈ రాత్రే బయలుదేరి బెంగుళూరు వెళ్ళు" అన్నారు.

"క్షమించండి నాన్నా నాకు ఉద్యోగం వచ్చే వరకు మీరీ పెళ్ళి విషయం ఎత్తవద్దు" అని తను అన్నాడు.

"ఉద్యోగం ఎప్పుడు వస్తుందో, నా మాట విని వెళ్ళి పిల్లను చూచిరా, నీకిష్ట పడకపోతే మానేద్దాం"

"ఒద్దు నాన్నా నాకా సంబంధం ఇష్టంలేదు. నేను వెళ్ళను"

"ఇష్టం లేదు. ఔను ఎలా ఇష్టం ఉంటుంది. నువ్వు సరోజను చూసినప్పటి నుండి అదోలా వున్నావు. బైట వాళ్ళనుకొనే మాట లేవీ నేను వినలేదు. ఇప్పుడు తెలిసింది వాళ్ళందరూ అనుకొనే మాటలు నిజమని."

"నాన్నా మీరు విన్నదంతా అబద్ధం" అన్నాడతను.

"అబద్ధమా? కాదు అంతా నిజం నాకు ఎవరో ఉత్తరం కూడా రాశేరు. కానీ నేను నమ్మలేదు. ఇప్పుడు తెలిసింది నీ గుణం" అంటూ మరేం మాట్లాడకుండా వెళ్ళి పోయేరు.

ఆ మర్నాడు బెంగుళూరులో ఏదో కంపెనీకి ఇంటర్వ్యూకు రమ్మని ఆర్డరు వచ్చింది. దానిని తన తండ్రికి చూపేడు అది చూసి 'నాయనా ఎలాగో ఉద్యోగనిమిత్తం బెంగుళూరు వెళ్ళవలసిందేగదా? నా మాట విని అలాగే వెళ్ళి పిల్లను గూడా చూసిరా. ఇదిగో వారి ఎడ్రసు' అంటూ ఎడ్రసు ఇచ్చేరు. తను దానిని మరేమీ మాట్లాడకుండా తీసుకొని బెంగుళూరు వచ్చేసాడు.

× × ×

ఆలోచించుకుంటూ రవి మెల్లగా నడుస్తున్నాడు. ఎదురుగుండా ఏదో హోటలు కనిపించింది. దానిని చూడగానే రవికి అంతవరకు దాగివున్న ఆకలి వచ్చేసింది. గబాగబా హోటలకు వెళ్ళి టిపిన్ చేసి, బిల్లు చెల్లించి బయట పడ్డాడు.

ఆఫీసంతా చాలా పెద్దదిలా వుంది. తనలాగే ఒక ఇరవై మంది ఇంటర్వ్యూకు వచ్చేరు. తనదే ఆఖరు నంబరు. మేనేజరు రూంవద్ద అందరినీ కూర్చో బెట్టి నెంబరు వారీగా ఒక్కొక్కరినే లోపలకు పంపుతున్నారు. కానీ వెళ్ళిన వారంతా వచ్చేటప్పుడు ముఖం చిన్న బుచ్చుకొని వస్తున్నారు.

ఆఖరున రవి వంతు వచ్చింది. మెల్లగా రూంలోకి వెళ్ళేడు. మేనేజరు వెనక్కితిరిగి కూర్చొని సిగరట్టు పీలుస్తూ పొగ వదులుతున్నాడు.

'నమస్కారమండీ' అన్నాడు రవి.

సమాధానంగా 'ఊ' అని మాత్రం వచ్చింది.

తరువాత రెండు నిముషాల వరకూ ఎవరూ మాట్లాడలేదు. ఆఖరున మేనేజరు 'మీ పేరు రవికదూ'అన్నాడు.

'ఔనండి' అన్నాడు రవి ఇంకా తనకు ఎలాంటి కఠిన ప్రశ్నలు వేస్తారో అనే భయంతో.

'మీరు చిన్నప్పుడు చదువుకునే రోజుల్లో రామం అనే స్నేహితుడుండేవాడు మీకు జ్ఞాపకముందా?'

'ఇదేవిటీ ఉద్యోగం కోసం రమ్మని ఇలాంటిప్రశ్నలు వేస్తున్నారు' అందామనుకున్నాడు. కానీ సమాధానంగా-

'అవునండీ జ్ఞాపకముంది.' అన్నాడు.

'మెట్రిక్యులేషన్ పరీక్షలులో అతనికి మీరు కాపీ అందించేరు కదూ.'

'అరే! ఆ సంగతి ఈయన కెలా తెలిసింది' అనుకుంటూ 'ఏమోనండి ఆ సంగతి అంత గుర్తుకు రావటం లేదు.' అన్నాడు.

'ఒకసారి మీ వీది చివరనున్న మామిడి తోటలో మీరిద్దరూ కాయలు దొంగతనం చేస్తుండగా తోట మాలి కనిపెట్టి మిమ్మల్ని పట్టుకున్నాడు. కానీ మీ స్నేహితుడు తప్పించుకున్నాడు ఔనా?'' అన్నాడు.

"భగవంతుడా ఇవన్నీ ఈయనగారికి ఎలా తెలుసు." అనుకొని "ఔనండి గుర్తుంది." అన్నాడు.

"చూసారా మీ స్నేహితుడెంత స్వార్థపరుడో మీరు ఆపదలో వున్నారని తెలిసికూడ తప్పించుకు పారిపోయేడు."

"ఆ వయస్సులో ఇవన్నీ ఎలా తెలుస్తాయండి" అన్నాడు రవి.

ఇలాగే చాలా ప్రశ్నలు వేసేడు. అంతా రవి స్నేహితుడు రామం గురించే. ఆఖరికి రవి విసుగెత్తి "సార్ ఇంతసేపటివరకు మీరు వెనక్కితిరిగే మాట్లాడారు. కాస్త ముందుకు తిరిగి మీరు వేయవలసిన ప్రశ్న లేవో అడగండి." అన్నాడు.

"సారీ టైమయిపోయింది మీరు వెళ్లవచ్చు" అన్నాడు కఠినస్వరంతో మేనేజరు.

"సరే" అంటూ రవి లేచి ద్వారం దాకా వచ్చేడో లేదో "రవీ" అన్న పిలుపు విని ఆగి వెనక్కి చూసేడు ఆశ్చర్యం! ఇంతసేపు తను మేనేజరుగా భావిస్తున్నాయన తన చిన్ననాటి స్నేహితుడు రామం.

"రామం" అంటూ దగ్గరగా వచ్చేడు రవి.

"రవీ" అంటూ ఆలింగనం చేసుకున్నాడు రామం. "రవీ" మీ నాన్నగారు బాగున్నారా?" అని అడిగేడు రామం.

"బాగానే వున్నారు." మరి మీ నాన్నగారో?"

ఆ మాట వినగానే రామం కళ్ళల్లో నీరు తిరిగింది. "రవీ నాన్నగారు పోయి రెండు సంవత్సరాలయింది" అన్నాడు.

"అరే! ఎలాంటి వార్త విన్నాను."

"ఔను రవి నీకు తెలుసుగా ఆయనకు త్రాగుడు అలవాటని దానితోనే జబ్బు వచ్చి ఆయన చనిపోయేరు' ఆ తరువాత నాకీ ఉద్యోగం వచ్చింది. నేనూ, చెల్లాయి' అమ్మ ఇప్పుడు వున్నాం. అదంతా అలా వుంచు నువ్వు బెంగుళూరు ఒక్కపనిమీదే వచ్చేవా లేక ఇంకా ఏవేనా పనులు వున్నాయా?" అని అడిగేడు రామం.

"రెండు పనులమీద వచ్చేను. కానీ ఆ రెండో పని నా కిష్టం లేదు."

"ఏవిటా రెండో పని?"

"ఆ ఏమీ లేదు నా పెళ్ళి కోసం వధువును చూడటం."

"అరే ఇష్టం లేదంటా వేమిటి."

"అదేమిట్రా నువ్వూ అలా అంటావు. నాకా ఉద్యోగం లేదు. అప్పుడే పెళ్లేమిటి?"

"నీకు ఉద్యోగం లేకపోవడమేమిటి? నీవు ఏ ఉద్యోగం కోసం వచ్చేవో అది ఖాయం చేసేస్తాను. ఏదీ వారి ఎడ్రసు తెలుసునా నేనూ వస్తాను."

"ఇదిగో ఇప్పటివరకు దీనిని చూడేలేదు" అంటూ ఎడ్రసు కాగితం తీసి ఇచ్చేడు.

రామం దానిని చదివి "అరే! మా యింటి ఎడ్రసు. అయితే నువ్వు చూడబోయేది మా చెల్లెలినే నన్న మాట." అన్నాడు ఆశ్చర్యంగా.

"ఏమిటీ ఇదీ మీ ఎడ్రసా?" అని రవి అడిగేడు.

"ఔను మాదే బహుసా మా తాతగారు అంటే మా చుట్టం మీ నాన్నకు చెప్పి వుంటారు. అరే! ఇంకా ఇక్కడే వున్నాం పద ఇంటికి వెళదాం."

ఇద్దరూ కారులో ఇంటికి వెళ్లేరు. హాల్లో రవిని కూర్చోపెట్టి రామం లోపలికి వెళ్లేడు. రవి అక్కడ వున్న పత్రికను తిరగవేస్తుండగా "నమస్కారం" అని పించింది.

తలెత్తి చూసేడు "సరోజ" ఆనాడు రిక్షాకు డబ్బులు లేకపోతే తను సహాయం చేసిన సరోజ.

"అరే! మీరిక్కడి కెలా వచ్చేరు." అని అడిగేడు.

"అదాంతా తరువాత మాట్లాడుకుందాం మీ పన్నెండణాలు తిరిగి ఇవ్వటం మర్చిపోయేను. మీ వూర్లో వారం రోజులు వుండి కూడ. ఇందండి మీ పన్నెండణాలు" అంటూ డబ్బులు చేతిలో పెట్టింది.

"అదేమిట్రోయ్ ఇప్పట్నించే మా చెల్లాయి దగ్గర డబ్బులు కొట్టేస్తున్నావు." అంటూ రామం వచ్చేడు,

"అరే ఈవిడ మీ చెల్లాయా!" అని ఆశ్చర్యంతో అడుగేడు రవి.

"అంతే కాదు. నువ్వు చూద్దామనుకొన్న పెళ్ళి కూతురు కూడ." అన్నాడు రామం.

ఆ మాట వినగానే సరోజ సిగ్గుతో లోపలికి పరిగెత్తింది.

"ఏరా నాయనా పెళ్ళి కూతురు నచ్చిందా?" అని అడిగేడు రామం.


"సరేగాని నువ్వు కట్నం ఎంతిస్తావు."

"ఇంకా ఏం కట్నం రా. దాని బదులుగా ఉద్యోగం ఇప్పించేసుచాలదూ, సరేగాని సరోజకూ నీకు ఎప్పట్నించి పరిచయం వుంది" అని అడిగేడు రామం.

సరోజ తనకు ఎలా పరిచయమైందో చెప్పేడు రవి. "ఊ! రిక్షావాడి ధర్మమా అంటూ ఆ నాటి పరిచయం ఈనాడు వియ్యంగా మారింది. త్వరగాలే స్నానం చేద్దువు గాని ఇవాళే మీ నాన్నకు టెలిగ్రాం ఇచ్చి ఇక్కడకు రప్పిస్తాను." అన్నాడు రామం.

"మొత్తం మీద కట్నం బాధ నీకు తగ్గిందిలే" అంటూ లేచాడు రవి.

కొద్దిరోజుల్లోనే సరోజా, రవిల వివాహం వైభవోపేతంగా జరిగిపోయింది.




**సమష్టి కృషి, సమైక్య పురోగమనం**

ప్రజల క్రమశిక్షణ, వారి సమష్టి కృషి, సమైక్య పురోగమనం మొదలైన వాటిపైనే దేశ శక్తి ఆధారపడివుంది. మన స్వాతంత్ర్యానికి వచ్చిన సవాలును ఎదుర్కొనటానికి ఐకమత్యం, సమష్టి కృషి తరువాయాలు. ఐకమత్యం పెంపొందింపండి; కార్యదీక్షతో కృషిచేయండి.